క్లుప్తంగా

మండల స్థాయి పాఠశాల క్రీడలపై సమీక్ష

జూలూరుపాడు: వచ్చే నెల 10, 11వ తేదీల్లో నిర్వహించే మండల స్థాయి పాఠశాల క్రీడలపై జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి గుగులోత్ వెంకట్ ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్ఎంలు, పీడీ, పీఈటీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్స్ హెచ్ఎంలు, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

టేకులపల్లి: ప్రజలు, విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని టేకులపల్లి మండల వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. శనివారం మద్రాస్ తండా, దంతెల తండా, కోయగూడెం ఆశ్రమ పాఠశాల, బోడు హైస్కూల్‌లో, స్టేషన్ తడికలపూడి, కొండంగుల బోడు గ్రామాలలో సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చికిత్స అందించారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం జీవన విధానంలో ఒక భాగంగా చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉద్యమకారులను గుర్తించండి..


మాట్లాడుతున్న మాథ్యూస్

కొత్తగూడెంఅర్బన్: తొలి దశ 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొని పోలీసుల లాఠీ దెబ్బలు తిని, ఆనాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాలను చేశామని, ప్రస్తుతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేజీఎస్ మాథ్యూస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కొత్తగూడెం పట్టణం బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జయరాజ్, రాంచందర్, గౌస్, లక్ష్మీనారాయణ, కామేశ్వరరావు, వీరస్వామి, కామేశ్వరరావు, యాదగిరి, శ్రీ సాంబయ్య, సత్యనారాయణ, శైలేందర్ పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించండి..

జూలూరుపాడు: మూడు నెలల వేతనాలు ఇప్పించాలని కోరుతూ ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డికి శనివారం గ్రామ పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీపీ కార్మికులు మాట్లాడుతూ... మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు.

శ్రమదానం

ఇల్లెందు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమదానం చేశారు. కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతీఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ ఇళ్ల పరిధిలోనూ ఖాళీ సమయాలలో శ్రమదానం చేసి పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తద్వారా దోమలను నివారించి జ్వరాల బారి నుంచి బయటపడవచ్చని చెప్పారు. కార్యక్రమంలో తోర్తి జాన్, విలియం ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్య ఉంటేనే కోతలు..

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: టేకులపల్లి, బొమ్మనపల్లి, బోడు, కోయగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో అధికారికంగా ఎలాంటి విద్యుత్ కోతలు లేవని టేకులపల్లి ఏఈ హట్కర్ దేవా, బొమ్మనపల్లి ఏఈ పిండిపోలు బుజ్జి కన్నయ్య తెలిపారు. శనివారం సాక్షిలో ప్రచురితమైన విద్యుత్ కోతలు.. జనం వెతలు వార్తా కథనంపై వారు స్పందించారు. ఈ మేరకు మాట్లాడుతూ... నాలుగు సబ్‌స్టేషన్ల పరిధిలో జంపర్ కటింగ్, ఫ్యూజులు పోవడం, పక్షులు, కోతులు తీగలపై పడటం, పిడుగు పాటు, ఈదురు గాలులు, భారీ వర్షం, స్తంభాలు మార్చడం తదితర కారణాల వల్ల ఎల్‌సీ తీసుకోవడంతో విద్యుత్ సరఫరా కొంతసేపు నిలిపివేయాల్సి వస్తుందన్నారు.

ఎస్సీ రుణాలు విడుదల చేయాలి

కొత్తగూడెంరూరల్: గత ప్రభుత్వం ఎంపిక చేసిన ఎస్సీ లబ్ధిదారులకు సబ్సిడీ విడుదల చేయాలని తెలంగాణ చర్మకారుల లిడ్ క్యాప్ జేఏజెఏసీ కన్వీనర్ కూసపాటి శ్రీనివాస్ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఎండీ ఆనంద్‌కుమార్‌ను హైదరబాద్‌లో శనివారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో 2019-20-21 కింద ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేశారని, ఏళ్లు గడస్తున్నా ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదని వివరించారు. అదేవిధంగా గత ప్రభుత్వం దళిత బంధు కింద రూ.5 లక్షలు మాత్రమే ఇచ్చారని, మిగతావి ఇవ్వలేదని తెలిపారు. యాట సురేష్ పాల్గొన్నారు.

వేడుకలకు సిద్ధమైన ‘గిరి’ధారి




నాయకులగూడెంలోని ఆలయం (ఇన్‌సెట్) కొలువుదీరిన శ్రీకృష్ణుడు

ఆదివాసీలు ప్రధానంగా ప్రకృతి ఆరాధకులుగా ఉంటూ గ్రామదేవతలను పూజించడమే ఆనవాయితీగా వస్తుంది. కాలక్రమంలో హైందవ మత ఆచారాలను కూడా పాటిస్తూ వస్తున్నారు. ఇల్లెందు మండలం నాయకులగూడెనికి చెందిన ఆదివాసీలు ఓ అడుగు ముందుకేసి గిరిజన సంప్రదాయాలను అనుసరిస్తూ శ్రీకృష్ణుడికి ఆలయాన్ని నిర్మించారు. ప్రతీఏటా కృష్ణాష్టమి, హోలీ పండుగల్లో ఇక్కడ ఘనంగా వేడుకలు నిర్వహిస్తున్నారు.

- ఆరు దశాబ్ధాలుగా ఆదివాసీలచే పూజలందుకుంటున్న శ్రీకృష్ణుడు
- రేపు కృష్ణాష్టమి వేడుకలు

సండే స్పెషల్

ఇల్లెందురూరల్: నాయకులగూడెం ప్రజలు ఒకప్పుడు ఆదివాసీ సంప్రదాయాలను అనుసరిస్తూ పండగలు జరుపుకునేవారు. స్థానికులకు ఆదివాసీ దేవతలే పూనకంగా వచ్చి మంచిచెడ్డలు చెప్పి ప్రజలను హెచ్చరించేవారు. అయితే అర్వై ఏళ్ల కిందట ఈ గ్రామానికి చెందిన చాపల ముత్తయ్య అనే గిరిజనుడుకి శ్రీకృష్ణుడు ఆవహించేవారని గ్రామస్తులు చెబుతుంటారు. ఆ సమయంలో ఆయన పలుకులు చెబుతుండేవాడు. ఆయన చెప్పినవన్నీ జరుగుతుండడంతో ప్రజల్లో ముత్తయ్యతో పాటు ఆయన కొలిచే కృష్ణుడిపై విశ్వాసం పెరిగింది.

ఆలయ నిర్మాణం..
హిందూ ఆలయాల నిర్మాణ పద్ధతులకు భిన్నంగా ఇక్కడ కృష్ణుడి ఆలయ నిర్మాణం జరిగింది. ఏకలవ్యుడు తన గురువైన ద్రోణుడి ప్రతిమను ముందు ఉంచుకుని విలు విద్యలో అభ్యాసం చేసినట్టుగా ఇల్లెందులో తయారు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహాన్ని గ్రామానికి చాపల ముత్తయ్య తెచ్చుకున్నాడు. వేదాలు, హైందవ మత సంబంధిత అంశాల పట్ల విస్తృతమైన అవగాహన లేకపోవడంతో భక్త కన్నప్ప తరహాలో సొంత పద్ధతిలోనే తన ఆరాధ్యదైవం కృష్ణుడికి చాపల ముత్తయ్య పూజలు చేసేవాడు. ఆ తర్వాత సొంత భూమిలో గ్రామస్తుల సహకారంతో విగ్రహం చుట్టూ ఒక్కో నిర్మాణం చేసుకుంటూ చివరకు ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తెచ్చాడు.

పచ్చని పొలాల మధ్యలో..
ద్వాపరయుగంలో కృష్ణుడు బృందావనంలో విహరిస్తే ఈ కాలంలో నాయకులగూడెంలో శ్రీకృష్ణుడు చిక్కని అడవి పక్కన, పచ్చని పంట పొలాల మధ్య రణగొణ ధ్వనులకు దూరంగా వేణువు వాయిస్తూ ప్రశాంత వదనంతో భక్తులకు దర్శనమిస్తాడు. నిర్బంధాలు, కట్టుబాట్లు లేకుండా సంపూర్ణ భక్తి విశ్వాసంతో శ్రీకృష్ణుడిని ఇక్కడ దర్శించుకోవచ్చు, పూజించుకోవచ్చు. ప్రతీ ఏటా హోలీ పండుగ రోజు రాధాకృష్ణుల కల్యాణం, శ్రావణమాసంలో శ్రీకృష్ణుణి జన్మదినం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. చాపల ముత్తయ్య మృతి అనంతరం ఆయన కుమారుడు చాపల కృష్ణ ఆ బాధ్యతలను కొనసాగిస్తున్నారు.

గిరిజన పద్ధతిలో కృష్ణాష్టమి...
హైందవ సంప్రదాయలకు భిన్నంగా ఆదివాసీ సంప్రదాయం మేరకు కృష్ణాష్టమి రోజున ఉదయం శ్రీకృష్ణుడికి పంచామృతాలతో అభిషేకం చేసి నూతన వస్త్రాలతో అలంకరిస్తారు. సాధారణంగా ఆలయాల్లో పులిహోరా, చక్కెర పొంగలి, లడ్డూ లాంటివి నైవేద్యంగా పెడుతుంటారు. ఇక్కడ మొక్కజొన్నతో చేసిన గారెలు, పరమాన్నం నైవేద్యంగా కృష్ణుడికి సమర్పిస్తారు. ఆ తర్వాత ఆడపడుచులు పక్కపక్కనే నిల్చొని ఒకరినొకరు పట్టుకుని ఆదివాసీ నృత్యాలు చేస్తూ సంతోషంగా గడుపుతారు. జానపదం మేళవించిన భక్తి గీతాలు ఆలపిస్తారు. అనంతరం ఆదివాసీలు తమ చేలలో పండిన తొలి పంటతో చేసిన పిండివంటలు కలిపి ఉట్టిని సిద్ధం చేస్తారు. వీటితో సాయంత్రం ఉట్టిని కొట్టే వేడుక కృష్ణాష్టమి జరుపుతారు. వేడుకలో నాయకులగూడెంతో పాటు సమీప గ్రామాల ప్రజలు హాజరవుతారు. అయితే ఈ వేడుకల్లో ఎక్కువ మంది ఆదివాసీలే పాల్గొనడం నాయకులగూడెం విశేషం. భక్తి తప్ప మరే హంగూ ఆర్భాటం లేకుండా జరిగే కృష్ణాష్టమి వేడుకలు కృష్ణుడి ఆరాధకులకు మునుపెన్నడూ లేనంత సరికొత్త అనుభూతిని అందిస్తాయి.

భక్తిశ్రద్ధలతో వేడుకలు...



గ్రామంలో చాపల ముత్తయ్య భక్తిశ్రద్ధలతో ఆలయం నిర్మించిన నాటి నుంచి గ్రామస్తులంతా ఆయన భక్తులమయ్యాం. ఏటా శ్రీకృష్ణుణి కల్యాణం, కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తాం. ఆయా రోజులను ప్రత్యేక దినాలుగా భావించి గ్రామమంతా సమష్టిగా వేడుక నిర్వహించుకుంటాం.
– సూర్నపాక రామయ్య, నాయకులగూడెం

సంప్రదాయంగా పూజ చేస్తాం..



ఆరు దశాబ్దాల క్రితం మా తండ్రి చాపల ముత్తయ్య గ్రామంలో ఆలయం నిర్మించారు. ప్రారంభంలో చిన్నగా ఉన్న ఆలయాన్ని భక్తులే నూతన హంగులతో తీర్చిదిద్దారు. ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలోనే శ్రీకృష్ణునికి పూజలు చేస్తాం. ఉట్టి కొట్టడం సాధారణమే అయినా అందులో పెట్టే పిండి వంటలు ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో సిద్ధం చేసుకుంటాం.
– చాపల కృష్ణ, పూజారి, శ్రీకృష్ణుణి ఆలయం

నియామకాలు చేపట్టండి..

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర సమాచార శాఖలో ఖాళీగా ఉన్న చీఫ్ కమిషనర్, సమాచార కమిషనర్లను వెంటనే నియమించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ యర్రా కామేష్ ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయా పదవులు గత ఏడాది ఏప్రిల్‌లో ముగిసినా గత ప్రభుత్వం కొత్తవారిని నియమించలేదని, ఈ ప్రభుత్వమైనా వెంటనే సమాచార కమిషనర్ల నియామకం చేపట్టాలని కోరారు.

వాటర్ ఫిల్టర్ షోరూం ప్రారంభం

ఇల్లెందు: కోర్టు సమీపంలో డిగ్నిటీ ఆల్కలిన్ వాటర్ ప్యూరిఫికేషన్ షోరూం ప్లాంట్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎండీ శ్రీధర్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ మోహన్‌నాయక్, యజమాని అజ్మీర రవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు..


మాట్లాడుతున్న డీఎస్పీ సతీష్‌కుమార్

పాల్వంచరూరల్: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ఉజ్వల భవిష్యత్‌ను బాటలు వేసుకోవాలని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం యాంటీ ర్యాగింగ్, మాదకద్రవ్యాలు నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్పీ మాట్లాడారు. తల్లిదండ్రులు మనపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా లక్ష్య సాధన కోసం నిరంతరం కష్టపడి చదువుకోవాలని సూచించారు. అనంతరం సీఐ వినయ్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటే జైలు శిక్షలు పడతాయన్నారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ పద్మ, రూరల్ ఎస్ఐ బి.సురేష్, యాంటీ ర్యాగింగ్ కమిటీ కోఆర్డినేటర్లు కామేశ్వరరావు, రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

టేకులపల్లి: కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద నిరసన తెలియజేశారు. మాట్లాడుతూ... కేజీబీవీలో నాణ్యత లేని భోజనం పెడుతున్న ఎస్ఓపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్ అధ్యాపక పోస్టును భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యుత్ సౌకర్యం కల్పించాలని, బిల్డింగ్‌కు మరమ్మతులు చేయించాలి డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ కళాశాల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రామ్ చరణ్, ఉదయ్‌కుమార్, అరుణ్, పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

ఇల్లెందు: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఏరియా జీఎం జాన్ ఆనంద్ సూచించారు. ఏరియా పరిధిలోని సింగరేణి ఆస్పత్రిని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఓపీ, ప్రత్యేక గదులను పరిశీలించారు. నేరుగా రోగులతో మాట్లాడుతూ.. ఆస్పత్రిలో సేవలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితిలో వెనువెంటనే మార్పులు వస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీజీఎం మోహన్‌రావు, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో సౌకర్యాలు కల్పించండి..



మాట్లాడుతున్న నబీ

ఇల్లెందు: ఇల్లెందు సీహెచ్‌సీ వంద పడకల ఆస్పత్రిలో మౌలిక వసతులు మెరుగుపర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు శనివారం ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో వైద్యులు సమయపాలన పాటించడం లేదని, వైద్యుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల రోగుల పట్ల సిబ్బంది అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు కూడా లేవని, రోగుల అవసరానికి తగినట్లుగా మందులు, పరీక్ష కిట్లు లేవని వాపోయారు. పట్టణంలో ఆరోగ్య పరిస్థితిపై పార్టీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించామని చెప్పారు. అనేక సమస్యలను ప్రజలు పార్టీ దృష్టికి తెచ్చారని చెప్పారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చి, ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో మన్యం మోహన్‌రావు, ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

‘స్వయం ఉపాధి’ పొందండి..


మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: మహిళా శక్తి పథకంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న స్వయం ఉపాధి యూనిట్లను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మహిళా శక్తి పథకాలపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు ఇంటి వద్దే ఉంటూ అదనపు ఉపాధి పొందేలా ప్రభుత్వం పెరటి కోళ్లు, గేదెల యూనిట్లను మంజూరు చేస్తోందన్నారు. వాటిని వినియోగించుకొని ఉపాధి వనరులను మెరుగుపర్చుకోవాలని సూచించారు. గేదెల యూనిట్ కోసం రూ.98,370, 50 కోడి పిల్లల కోసం రూ.12,500, వంద కోడి పిల్లల కోసం రూ.22వేలు రుణాన్ని స్త్రీనిధి, బ్యాంకు లింకేజీల ద్వారా మంజూరు అవుతాయని చెప్పారు. ఈనిధులను 11 శాతం వడ్డీతో 48 వాయిదాలలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం కోళ్ల పెంపకం, గేదెల కొనుగోలు, పెంపకం, వాటికి వచ్చే వ్యాధులు, నివారణ చర్యలపై పశువైద్యాధికారి రాజేష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఊకే నాగమణి, సెర్ప్ ఏపీఎం దుర్గారావు, సుభాష్, ఈజీఎస్ ఏపీఓ శంకర్ పాల్గొన్నారు.

బీఎల్ఓలతో తహసీల్దార్ సమీక్ష


మాట్లాడుతున్న తహసీల్దార్ స్వాతి బిందు

జూలూరుపాడు: ఓటర్ల జాబితాపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.స్వాతి బిందు మాట్లాడుతూ... స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)లో భాగంగా బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు నమోదు చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలో ఓటరు పేరు, ఇంటి పేరు, తండ్రి పేరు, చిరునామా తప్పులు గుర్తింపు, మరణించిన ఓటరు తొలగింపు వంటి సవరణ చేయాలని బీఎల్ఓలకు తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో గిర్దావర్ ఎం.తిరుపతిరావు, బీఎల్ఓలు నానిబాబు, లక్ష్మణ్, వెంకట్, ఇస్మాయిల్, హరిబాబు, శ్రీనివాస్‌రావు, హరిత, పద్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓ విధులు చేయలేం..


తహసీల్దార్ నాగభవానీకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

టేకులపల్లి: మా పనులు మాకున్నాయి.. బీఎల్ఓ విధులు మేము చేయబోమని టేకులపల్లి మండలంలోని 22 మంది అంగన్‌వాడీ టీచర్లు తేల్చి చెప్పారు. ఈ మేరకు శనివారం టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన బీఎల్ఓల సమావేశంలో తహసీల్దార్ నాగభవానీకి వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా తయారీలో భాగంగా బీఎల్ఓలు ఇంటింటి సర్వే కార్యక్రమం ప్రారంభం అయింది. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీలు తమ గోడు చెప్పుకున్నారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించి పనులు ఉంటాయని, పిల్లలు, తల్లులు, గర్భిణులకు పోషకాహారం అందించడం, రోజువారీ వివరాలు మొబైల్‌లో నమోదు చేయడం తదితర పనులు ఉంటాయని ఈ క్రమంలో బీఎల్ఓగా చేయడం అదనపు పనిభారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ పనులతోనే బిజీగా ఉన్నామని, దయచేసి బీఎల్ఓ విధులు తమకు అప్పగించొద్దని తహసీల్దార్‌ని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 22 మంది అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సింగరేణి వార్షిక లాభాలు ప్రకటించాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

ఇల్లెందు: సింగరేణి వార్షిక లాభాలు ప్రకటించి కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ చెల్లించాలని ఇఫ్టూ అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి కొండపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ఇఫ్టూ కార్యాలయంలో మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం ఒకే కంపెనీ.. ఒకే కుటుంబం.. అంటూ ప్రచారం చేసుకుంటోందని, కానీ కాంట్రాక్ట్ కార్మికులను మాత్రం అంటరానివాళ్లుగా చూస్తోందని ఆరోపించారు. క్యాంటీన్లలో కాంట్రాక్ట్ కార్మికులకు టిఫిన్, టీ కూడా ఇవ్వడం లేదన్నారు. వార్షికోత్సవాల సందర్భంగా కనీసం స్వీట్ ముక్క, ప్రోత్సాహక బహుతులు కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు చెప్పినట్లుగా లాభాలలో 10 శాతం కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్‌గా చెల్లించాలని కోరారు. సమావేశంలో మహేందర్, శ్రీనివాస్, సాయి, లక్ష్మణ్, గణేష్ పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరించండి..

కొత్తగూడెంఅర్బన్: దశాబ్దాల చరిత్ర, ఎంతోమంది ప్రయోజకులుగా తీర్చిదిద్దిన శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ పీజీ కళాశాలను అభివృద్ధి చేయాలని కోరుతూ శనివారం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్యకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఈ కాలేజీలో చదువుకున్న పలువురు విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగారని చెప్పారు. కానీ కొంత మంది రాజకీయ కుట్రలతో కళాశాలను నాశనం చేస్తున్నారని, కొత్తగూడెం నడిబొడ్డులో ప్రైవేట్ కాలేజీకి మంచిపేరు ఉందదన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని స్థానికులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు


రాధ వేషధారణలో చిన్నారి

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. బాలబాలికలు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో ఆటపాటలతో సందడి చేశారు. ఆయా పాఠశాలల ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్


సింగరేణి(కొత్తగూడెం): సెయింట్ జోసఫ్ పాఠశాలలో...


సుజాతనగర్: శ్రీవాణి నికేతన్ ప్రైవేట్ స్కూల్‌లో..


కొత్తగూడెంరూరల్: త్రివేణి పాఠశాలలో..


ఇల్లెందురూరల్: కొమరారం ప్రాథమిక పాఠశాలలో


టేకులపల్లిలోని గ్రావిటీ ప్రీమియర్ స్కూల్‌లో..


బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో...

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గారాంప్రసాద్ - 9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183